గణనాథుడికి ఘన పూజలు


జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడిలో గణనాథుడికి గిరిక అర్చన, పుస్తక పూజ చేస్తున్న చిన్నారులు


నవాబుపేటలోని హనుమాన్ ఆలయంలో భక్తులచే పూజలందుకుంటున్న గణనాథుడు


చిన్నచింతకుంట ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలోని గణేశ్ మండపంలో గీతా పారాయణం చేస్తున్న భక్తులు


దేవరకద్ర వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి ఆలయ ప్రాంగణంలోని విఘ్నేశ్వరుడి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మళ్లీ రోడ్డెక్కిన రైతులు

- టోకెన్లు పొందిన వారికి సైతం యూరియా ఇవ్వడం లేదని ఆగ్రహం
- ఏఓతో వాగ్వాదం


నవాబుపేట పీఏసీఎస్ వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

భూత్పూర్: యూరియా కోసం రైతులు మళ్లీ రోడ్డెక్కారు. ఎరువుల డీలర్లు తమ సన్నిహితులు, బంధువులకు గుట్టుచప్పుడు కాకుండా యూరియాను అందిస్తూ.. తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ శుక్రవారం భూత్పూర్ చౌరస్తాలో పెద్ద సంఖ్యలో బైఠాయించి ధర్నా చేపట్టారు. జిల్లాలో యూరియా కొరత లేదని కలెక్టర్ చెబుతుండగా.. ఇక్కడ మాత్రం ఎందుకు అందించడం లేదని ఏఓ మురళీధర్‌ను నిలదీశారు. గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడిన వారికి టోకెన్లు సైతం నామమాత్రంగా ఇస్తున్నారని.. టోకెన్లు పొందిన వారికి యూరియా అందడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. కాగా, మధ్యాహ్నం వరకు యూరియా వస్తుందని ఏఓ చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు.

తప్పని పడిగాపులు..

నవాబుపేట: మండల కేంద్రంలోని పీఏసీఎస్ వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరారు. పొద్దస్తమానం పడిగాపులు కాశారు. తీరా సాయంత్రం యూరియా లోడ్ రావడంతో ఒక్కసారిగా ఎగబడ్డారు. అప్పటికే రాత్రి కావడంతో శనివారం యూరియా అందిస్తామని చెప్పడంతో నిరాశతో వెనుదిరిగారు.


భూత్పూర్‌లో ఆగ్రో రైతు సేవాకేంద్రం వద్ద యూరియా కోసం ఎదురుచూస్తున్న రైతులు

పరిసరాల పరిశుభ్రతే ముఖ్యం

- కలెక్టర్ విజయేందిర బోయి


ఎదిరలో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ/దేవరకద్ర/జడ్చర్ల టౌన్/గండేడ్: అందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలెక్టర్ విజయేందిర బోయి సూచించారు. 'డ్రై డే'ను పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని వినాయక్‌నగర్, ఎదిర, శేషాద్రినగర్ తదితర ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటి ఆవరణలో చెత్త, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. వాడని పాత్రలు, కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, కుండీలలో వర్షపునీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతాయన్నారు. వీటితో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందన్నారు. వినాయక్‌నగర్‌లో ఇళ్ల నుంచి వచ్చిన మురుగుతో పాటు వరదనీరు నిల్వ ఉండటం చూసి వెంటనే అక్కడ మట్టి వేయాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని ఆదేశించారు. ఎదిరలోని ఓపెన్ ప్లాట్లలో వర్షపునీటిని గమనించి యజమానులకు నోటీసులు జారీ చేయాలన్నారు. అనంతరం శేషాద్రినగర్‌లో డెంగ్యూ కేసు నమోదైన ఇంటిని పరిశీలించి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే బీకేరెడ్డికాలనీలోని మైనారిటీ గురుకుల బాలుర పాఠశాల–1ని తనిఖీ చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో వెంటనే శుభ్రం చేయించాలని కమిషనర్‌ను ఆదేశించారు. కాగా, పాఠశాలలో జ్వరం వచ్చిన విద్యార్థులతో 'ఇప్పుడు ఎలా ఉంది? ఉదయం ఏమైనా తిన్నారా.. ఆరోగ్యం బాగానే ఉంది కదా..' అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడి వంట గదిలో గుడ్డు చిన్నగా ఉండటం గమనించి ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌ను తొలగించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి శంకరాచారిని ఆదేశించారు. ఆమె వెంట స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.శశికాంత్ తదితరులు ఉన్నారు.

అన్ని డివిజన్లలో 'డ్రై డే'

నగర పరిధిలోని 60 డివిజన్లలో శుక్రవారం 'డ్రై డే' నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు ఆఫీసర్ల ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు, ఆశా కార్యకర్తలు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఇంటింటికీ తిరిగి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. పలు వీధుల్లో ఫాగింగ్‌తో పాటు మురుగుకుంటలు, ఓపెన్ ప్లాట్లలో నిలిచిన వర్షపు నీటిలో ఆయిల్ బాల్స్ వేయించారు.

■ దేవరకద్ర పట్టణంలోని మూడో వార్డు రహమాన్ నగర్, కుర్వగేరిలో పారిశుద్ధ్య పనులను మున్సిపల్ కమిషనర్ నరేష్‌బాబు పరిశీలించారు. దోమల నివారణ కోసం అందరూ శుభ్రత పాటించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఈఓ సీత్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

■ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జడ్చర్ల మండల ప్రత్యేకాధికారి జంగయ్య అన్నారు. డ్రై డే కార్యక్రమంలో భాగంగా బూర్గుపల్లి, కిష్టంపల్లి, గంగాపురం పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. గంగాపురంలో పీహెచ్‌సీని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

■ గండేడ్ మండల కేంద్రంలోని బీసీ హాస్టల్, పరిసర ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేశారు. అదే విధంగా వెన్నాచేడ్, కొంరెడ్డిపలి, పగిడ్యాల్, పెద్దవార్వాల్, సల్కర్‌పేట్ తదితర గ్రామాల్లో నిల్వ నీటిని పారబోయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరిశ్చంద్రారెడ్డి, మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్, సీహెచ్‌ఓ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నల్లకుంట పరిశీలన



జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలోని నల్లకుంట చెరువును శుక్రవారం జెడ్పీ సీఈఓ వెంకట్‌రెడ్డి పరిశీలించారు. నల్లకుంట 90శాతం నీటితో నిండటంతో ఆర్‌యూబీలోకి నీరు చేరే అవకాశం ఉందని సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ఆయన సందర్శించి.. ముందస్తు జాగ్రత్త చర్యలపై ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. జెడ్పీ సీఈఓ వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి, డీఈ వినోద్, ఇరిగేషన్ ఈఈ విజయభాస్కర్‌రెడ్డి, ఏఈ గాయత్రి ఉన్నారు.

ఆహారంలో నాణ్యత లోపించొద్దు



నవాబుపేట: విద్యార్థులకు అందించే ఆహారంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని మండల ప్రత్యేకాధికారి సునీత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఆమె ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు రికార్డులతో పాటు విద్యార్థినుల కోసం వండిన భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని కేజీబీవీ సిబ్బందికి సూచించారు. ప్రత్యేకాధికారి వెంట ఎంపీడీఓ జయరాంనాయక్, ఎస్‌ఓ మాధవి ఉన్నారు.

మాజీ సైనికుడికి అశ్రునివాళి



నవాబుపేట: మండలంలోని కూచూర్‌కు చెందిన మాజీ సైనికుడు బసిరెడ్డి యాదగిరి రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. శుక్రవారం ఆయనకు స్వగ్రామంలో అంతిమయాత్ర నిర్వహించగా.. ఆర్మీ జవాన్లతో పాటు గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొని అశ్రునివాళి అర్పించారు.

గురువుల పాత్ర కీలకం



అడ్డాకుల: కందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల విద్యాధికారి, జీహెచ్‌ఎం కురుమూర్తి పదవీ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో పాటు గ్రామస్తులు కురుమూర్తిని శాలువా, పూలమాలలతో సత్కరించారు. సమాజంలో గురువుల పాత్ర కీలకమని.. జీహెచ్‌ఎం కురుమూర్తి ఎంతో మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారని కొనియాడారు.

భక్తులకు అన్నదానం



పాలమూరు: జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ కాలనీలో ఏర్పాటుచేసిన గణేశ్ మండపం వద్ద శుక్రవారం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీవాసులు శారద, నవనీత, రాణి, అనూష, లక్ష్మమ్మ, రాధ, చిట్టెమ్మ, సంధ్య పాల్గొన్నారు.

ఘనంగా బలరామకృష్ణుడి జయంతి



నవాబుపేట: భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో బలరామకృష్ణుడి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం కార్యాలయ ఆవరణలో మండల అధ్యక్షుడు శ్రీరాములు కాషాయజెండా ఎగురవేశారు. బలరాముడి చిత్రపటాలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదర్శ పురుషుడిగా, ఆరాధ్య దేవుడిగా బలరాముడు వెలుగొందారన్నారు. భారతీయ కిసాన్ సంఘ్ సైతం వారి అడుగుజాడల్లో నడుస్తూ సనాతన ధర్మ పరిరక్షణ, సేంద్రియ సాగు, రైతు సమస్యల పరిష్కారానికి ముందుండి పోరాడుతుందని వివరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ధరిపల్లి రాంరెడ్డి, సంఘం జిల్లా కార్యదర్శి నరేందర్‌రెడ్డి, జట్టిరాములు, దేవరకొండ కుమార్, నర్సింహులు, వెంకటేశ్వరప్ప పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన ఉండాలి

జడ్చర్ల టౌన్: బ్యాంకు ఖాతాదారులందరికీ డిజిటల్ లావాదేవీలపై అవగాహన ఉండాలని ఆర్‌బీఐ రీజినల్ మేనేజర్ చిన్మయ్‌కుమార్ అన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సంయుక్త భాగస్వామ్యంతో శుక్రవారం రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మల్లెబోయిన్‌పల్లి, ఆలూరు, రాజాపూర్ గ్రామాల్లో రీకేవైసీ, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రజలు బ్యాంకింగ్ సేవలు, డిజిటల్ లావాదేవీల్లో భద్రత, సోషల్ సెక్యూరిటీ పథకాలు, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అదే విధంగా నసురుల్లాబాద్ ఉన్నత పాఠశాలలో బ్యాంకిగ్ వ్యవస్థపై ఎస్‌బీఐ బాదేపల్లి బ్రాంచ్ మేనేజర్ విశాల్‌కుమార్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం చంద్రశేఖర్, ఎఫ్‌ఐడీఈ జీఎం ముత్యాల్ జ్ఞానసు ప్రభాత్, ఎల్‌డీఓ దేబోజిత్ బరువా, స్టేట్‌బ్యాంక్ అధికారులు వినోద్‌కస్తూరి, నారాయణ అవధా, రామమూర్తి, టీజీబీ అధికారులు సత్యనారాయణ, గాయత్రి, మహేశ్వర్‌రెడ్డి, విశాల్‌కుమార్, అశోక్‌నాయక్ పాల్గొన్నారు.

నేడు బహిరంగ వేలం

చిన్నచింతకుంట: కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని దేవస్థానంలో కొబ్బరికాయలు, పూజా సామగ్రి, పూలు, దండలు విక్రయించేందుకు గాను శనివారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మదనేశ్వరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఓటు చోరీపై అవగాహన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: కేంద్ర ప్రభుత్వం ఓటు చోరీ ఎలా చేస్తుందనే అంశంపై శుక్రవారం పీయూలో ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, ఎన్‌ఎస్‌యూఐ కార్యదర్శి అనుప శేఖర్, వంశీ, నరేశ్‌యాదవ్, సోహెల్ పాల్గొన్నారు.

కేంద్ర నిధులతోనే అభివృద్ధి

హన్వాడ: కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు బీజేపీ ఎస్టీమోర్చా మండల అధ్యక్షుడు జూక్యానాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఏనెమీది తండాలో గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు మిట్యు, సంతోష్, రాము, మోహన్, రామకోటి, సత్యం పాల్గొన్నారు.

నీచ రాజకీయాలు చేస్తే సహించేది లేదు

జడ్చర్ల/జడ్చర్ల టౌన్: నీచ రాజకీయాలు చేస్తూ తన కుటుంబ సభ్యులపై తప్పుగా మాట్లాడితే సహించేది లేదని.. వచ్చే ఎన్నికల్లో జడ్చర్ల నియోజకవర్గం నుంచి పోటీ చేయనని ప్రకటిస్తే ఇక నుంచి నీ పేరు ఎత్తనని మాజీ మంత్రి లక్ష్మారెడ్డిపై ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. స్థానిక అంబేడ్కర్ కళాభవన్‌లో శుక్రవారం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇటీవల ఈర్లపల్లి తండాకు చెందిన రైతు ఆత్మహత్య ఘటనపై మాజీ మంత్రి శవ రాజకీయాలు చేయడం హేయనీయమన్నారు. జడ్చర్ల ఆస్పత్రిలో అవసరమైన బెడ్స్ లేకపోవడంపై తాము విచారిస్తున్నామని.. ఈ విషయంపై ఇప్పటికే మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. కానీ మాజీ మంత్రి ఇష్టానుసారంగా మాట్లాడటం సహేతుకం కాదన్నారు. వంద పడకల ఆస్పత్రి భవనాన్ని నాలాలో నిర్మించారని.. డాక్టర్లు, సిబ్బంది నియామకం చేయకుండానే ఎందుకు ప్రారంభించారని ప్రశ్నించారు. ఆస్పత్రి వద్ద అసైన్డ్ భూమి కొనుగోలుచేసి తప్పు చేశారని.. ఆ భూమిని వెనక్కి ఇవ్వకుండా కోర్టును ఆశ్రయించారని ఆరోపించారు. ఎర్రగుట్టలోని డబుల్ బెడ్రూం ఇళ్లను ఇతర ప్రాంతాల వారు కబ్జా చేసేందుకు రూ.2లక్షల చొప్పున వసూలు చేశారన్నారు. ఇందుకు సంబంధించి తమ వద్ద ఆధారాలు ఉన్నాయని తెలిపారు.


ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జడ్చర్ల ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఆయన సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రెస్‌క్లబ్ భవన నిర్మాణం కోసం స్థలం ఎంపిక చేసుకోవాలని, భవన నిర్మాణ బాధ్యత తనదని తెలిపారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి, తహసీల్దార్ నర్సింగరావు, కౌన్సిలర్లు చైతన్య చౌహాన్, రమేశ్, రాజు, ఉమాదేవి, వంశీచారి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం: పీయూ వీసీ


మాట్లాడుతున్న పీయూ వీసీ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని పీయూ వీసీ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పీయూ ఫార్మసీ ఆడిటోరియంలో నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. క్రీడలు ప్రతి మనిషి జీవితంలో భాగం కావాలన్నారు. పీయూలో సువిశాలమైన ప్రాంగణం ఉందని.. అనేక క్రీడా విభాగాలు ఉన్నాయన్నారు. పీయూ విద్యార్థులు సద్వినియోగం చేసుకొని క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో పీయూ రిజిస్ట్రార్ రమేశ్ బాబు, కంట్రోలర్ ప్రవీణ, ప్రిన్సిపాల్స్ మధుసూదన్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రవికాంత్, పీడీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 3కే రన్

జడ్చర్ల టౌన్/గండేడ్/ మహమ్మదాబాద్: జాతీయ క్రీడల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జడ్చర్ల మండలం కోడ్గల్‌లో 3కే రన్ నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి సీఐ కమలాకర్ రన్‌ను ప్రారంభించగా.. క్రీడాకారులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. విద్యార్థులు ఆరోగ్యంగా, ఉల్లాసంగా ఉండాలంటే రోజు ఆటలు ఆడాలని సూచించారు. 3కే రన్‌లో ఎంఈఓ మంజులాదేవి, ఏఎస్‌ఐ నాగేశ్వర్‌రెడ్డి, పీడీ రవికుమార్, అశోక్, హెచ్‌ఎం శ్రీనివాసులు, గురుకుల ప్రిన్సిపాల్ రజని రాగలత పాల్గొన్నారు.

■ గండేడ్ మండలంలోని వెన్నాచేడ్ బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా, తెలుగు భాషా దినోత్సవాలను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, క్విజ్ తదితర పోటీలు నిర్వహించి.. విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రవిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కోడ్గల్‌లో 3కే రన్‌ను ప్రారంభిస్తున్న సీఐ కమలాకర్

■ మహమ్మదాబాద్, వెంకట్‌రెడ్డిపల్లి, నంచర్ల, మొకర్లాబాద్ తదితర గ్రామాల్లో జాతీయ క్రీడా, తెలుగు భాషా దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యాన్‌చంద్, గిడుగు రామమూర్తి చిత్రపటాలకు పులమాలలు వేసి నివాళులర్పించారు.

నష్టపరిహారం చెల్లించాలని ధర్నా

అడ్డాకుల: మండలంలోని రాచాల పెద్దవాగులో నిర్మించిన చెక్‌డ్యాం వద్ద భూములు కోల్పోయిన దళిత కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కేవీపీఎస్, సీఐటీయూ, రైతు సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర నేత రాములు, సీఐటీయూ రాష్ట్ర నాయకుడు కిల్లె గోపాల్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కురుమయ్య మాట్లాడుతూ.. సర్వే నంబర్ 393, 394, 387లలో ఉన్న 8 ఎకరాల భూమిపై ఆధారపడి 150 దళిత కుటుంబాలు జీవిస్తున్నట్లు తెలిపారు. ఇందులో మూడెకరాల భూమిని ఆక్రమించి చెక్‌డ్యాం నిర్మించడంతో దళితులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ఇరిగేషన్ అధికారులు వాస్తవాలను అంచనా వేయకుండా దళితులకు అన్యాయం జరిగేలా చెక్‌డ్యాం డిజైన్ చేశారని ఆరోపించారు. తహసీల్దార్ విచారణ చేసి నష్టపోయిన దళితులకు న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ శేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రశాంత్, బాలరాజు, ప్రసాద్, శ్రీకాంత్, నర్సింహులు, ఆంజనేయులు, చెన్నకేశవులు, సాయికుమార్, అంజి పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రేపు చిత్రలేఖనం పోటీలు

స్టేషన్ మహబూబ్‌నగర్: స్ఫూర్తి సామాజిక సేవా యువజన కళాసంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 31న జిల్లా కేంద్రంలోని శ్రీసీతారామాంజనేయ గ్రంథాలయంలో 1వ తరగతి నుంచి డిగ్రీ విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్లు సంస్థ సభ్యులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 'నా ఊహల్లో గణేషుడి రూపం' అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు కలర్స్, ఇతర సామగ్రి వెంట తీసుకోచ్చుకోవాలని సూచించారు.

నేటి నుంచి వినికిడి పరీక్షలు

పాలమూరు: స్థానిక అంజనీ స్పీచ్ అండ్ హియరింగ్ క్లీనిక్ ఆధ్వర్యంలో శని, ఆదివారం ఉచితంగా వినికిడి పరీక్షలు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు సతీష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు వినికిడి పరీక్షలు చేయించుకోవచ్చని పేర్కొన్నారు. అత్యాధునిక పరికరాలతో పరీక్షలు చేసి.. సమస్య ఉన్న వారికి నాణ్యమైన పరికరాలను రాయితీపై అందించనున్నట్లు తెలిపారు. వివరాలకు 99892 93931 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

మహబూబ్‌నగర్ క్రైం/దేవరకద్ర: జిల్లా కేంద్రంతో పాటు దేవరకద్రలో శుక్రవారం గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. జిల్లా కేంద్రంలో రూరల్ పోలీసుల సమన్వయంతో కార్పొరేషన్ అధికారులు పాలకొండ చెరువు, మయూరీ పార్క్ సమీపంలో ఉన్న గంగుసాయి చెరువుల వద్ద ముళ్లపొదలు, కంపచెట్ల తొలగింపు పనులు చేయించారు. దేవరకద్రలో పెద్దచెరువు వద్ద గణేశ్ నిమజ్జనానికి అనువుగా ఉన్న స్థలాన్ని మున్సిపల్ కమిషనర్ నరేష్‌బాబు, ఈఓ సీత్యానాయక్, ఎస్‌ఐ నాగన్న పరిశీలించారు.

ఫర్టిలైజర్ దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

మిడ్జిల్: మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో శుక్రవారం రాష్ట్ర విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. దుకాణాల్లో యూరియా నిల్వ, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. యూరియాను అధిక మొత్తంలో తీసుకెళ్లిన వారి వివరాలను సేకరించారు.

కొల్లూర్‌లో డెంగీ కేసు

నవాబుపేట: మండలంలోని కొల్లూర్‌లో శుక్రవారం డెంగీ కేసు నమోదైంది. సమాచారం అందుకున్న వైద్యసిబ్బంది గ్రామంలో పర్యటించి దోమల నివారణ చర్యలు చేపట్టారు. ఇంటి పరిసరాల్లో ఎక్కువ రోజుల పాటు నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. బ్లీచింగ్ పౌడర్ చల్లారు.

మిడ్జిల్‌లో భారీ వర్షం



మిడ్జిల్: మండలంలో గురువారం అర్ధరాత్రి నుంచి భారీ వర్షం కురిసింది. సుమారు 5గంటల పాటు కురిసిన వర్షంతో చెరువులు, కుంటలు అలుగులు పారాయి. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. పంట పొలాలను వరద ముంచెత్తింది. మండలవ్యాప్తంగా 60 మి.మీ. వర్షపాతం నమోదైంది.

చౌడూర్ చెరువుకు మరమ్మతు

నవాబుపేట: మండలంలోని చౌడూర్ పెద్దచెరువు పూర్తిస్థాయిలో నీటితో నిండి అలుగు పారుతోంది. ఈ క్రమంలో చెరువు కట్టకు చిన్నపాటి లీకేజీ ఏర్పడటంతో గ్రామస్తులు మండల అధికారులకు సమాచారం అందించారు. శుక్రవారం తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ జయరాంనాయక్, ఇతర అధికారులు చెరువు వద్దకు చేరుకొని లీకేజీకి తాత్కాలికంగా మరమ్మతు చేయించారు. చెరువు కట్టకు ఎలాంటి ప్రమాదం జరగదని.. గ్రామస్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు భరోసా ఇచ్చారు.

ఆలూరు వద్ద తప్పిన ప్రమాదం



జడ్చర్ల టౌన్: జడ్చర్ల మండలంలోని ఆలూరు గ్రామ సమీపంలో శుక్రవారం రాత్రి రోడ్ డ్యాం అలుగు పారుతుండగా గ్రామానికి చెందిన ఆటోలో ఇద్దరు వ్యక్తులు జడ్చర్లకు వస్తుండగా వరద నీటిలో చిక్కుకుపోయారు. ఆటోలో నుంచి బయటకు రాలేక ఇబ్బందులు పడ్డారు. విషయం తెలిసిన గ్రామస్తులు అక్కడికి చేరుకొని తాళ్ల సహాయంతో ఆటోతో పాటు అందులో ఉన్న ఇద్దరిని బయటికి లాగడంతో ప్రమాదం తప్పింది.